సాక్షి ఖమ్మం

శుక్రవారం । 10 । ఫిబ్రవరి । 2023



నెరవేరిన సెర్ప్ ఉద్యోగుల కల

సెర్ప్ ఉద్యోగులకు పే స్కేల్ అమలు చేయనున్నట్లు రాష్ట్రప్రభుత్వం ప్రకటించడంతో వారి 23ఏళ్ల కల ఫలించినట్లయింది. 10లో



పన్ను చెల్లించకపోతే పంపు కట్

కేఎంసీ పరిధిలో భారీగా పేరుకుపోయిన నల్లా కనెక్షన్ల బకాయిలు రాబట్టడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. 8లో

గరిష్టం / కనిష్టం
36° / 19°

వాతావరణం

శుక్రవారం ఉదయం, రాత్రి చలి గాలులు పెరుగుతాయి. మధ్యాహ్నం వేళ ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆన్‌లైన్‌లోనూ 'లోక్ అదాలత్'



అవార్డు జారీ చేస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు

ఖమ్మంలీగల్: రోడ్డు ప్రమాద బాధితులు లోక్ అదాలత్ ఎదుట హాజరుకాలేని పక్షంలో ఆన్‌లైన్‌లో విచారించి అవార్డు జారీ చేస్తామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు తెలిపారు. న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ మహ్మద్ అబ్దుల్ జావేద్ పాషాతో కలిసి గురువారం ఆయన రోడ్డు రవాణా సంస్థపై దాఖలైన నష్టపరిహారం కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఓ న్యాయవాది తమ కేసులో బాధితుడు లేవలేని పరిస్థితిలో ఉన్నాడని న్యాయమూర్తి దృష్టికి తీసుకురాగా, ఆన్‌లైన్‌లో పరిశీలించడమే కాక కేసు పరిష్కరించి అవార్డు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, డాక్టర్ గిరిసింహారావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

శ్రీశైలంకు ప్రత్యేక బస్సు



ఖమ్మం మామిళ్లగూడెం: మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలం వెళ్లే భక్తుల కోసం ఖమ్మం నుండి సూపర్ లగ్జరీ సర్వీస్ ఏర్పాటుచేసినట్లు డిపో మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 17న రాత్రి 10గంటలకు బయలుదేరే ఈ బస్సు(సర్వీస్ నంబర్ 64036)లో వెళ్లేందుకు అడ్వాన్స్ రిజర్వేషన్ చేయించుకోవచ్చని పేర్కొన్నారు. ఖమ్మం నుంచి శ్రీశైలంకు చార్జీ రూ.640గా నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే, ఈనెల 17, 18, 19వ తేదీల్లో ఖమ్మం కొత్త బస్టాండ్, సిటీ బస్టాండ్, కాల్వొడ్డు పాయింట్ల ద్వారా కామంచికల్ మీదుగా తీర్థాలకు 45 ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు డీఎం వెల్లడించారు. ఈ బస్సులో పెద్దలకు రూ.30, పిల్లలకు రూ.20గా చార్జీ నిర్ణయించినట్లు తెలిపారు.

'కంటి వెలుగు'తో పేదలకు లబ్ధి




శిబిరంలో పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ మాలతి

వైరారూరల్: రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న కంటి వెలుగు కార్యక్రమంతో పేదలకు లబ్ధి చేకూరుతుందని డీఎంహెచ్‌ఓ మాలతి తెలిపారు. మండలంలోని రెబ్బవరంలో కంటి వెలుగు శిబిరాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. ఐదు రోజుల క్రితం ప్రారంభించిన ఈశిబిరంలో ఇప్పటి వరకు 500 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 200 మందికి కంటి అద్దాలు చేసినట్లు డాక్టర్ వుండ్రు శ్యాంబాబు తెలిపారు. కాగా, ఎక్కువ మంది శిబిరానికి వచ్చేలా అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ సూచించారు. పీహెచ్‌సీ వైద్యురాలు ఉదయలక్ష్మి, సర్పంచ్ సాదం రామారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ నామ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్‌ఎస్ లోక్‌సభాపక్ష నాయకుడు, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఖమ్మం, వైరా, కొత్తగూడెం నియోజకవర్గాల్లో పర్యటించనున్న ఎంపీ పలు కార్యక్రమాలకు హాజరవుతారని ఆయన క్యాంపు కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

పాఠశాలల్లో డీఈఓ తనిఖీ



విద్యార్థులకు ప్రశ్నలు వేస్తున్న డీఈఓ శర్మ

ఖమ్మంరూరల్: మండలంలోని ముత్తగూడెం, జలగంనగర్ ఉన్నత పాఠశాలలను గురువారం డీఈఓ సోమశేఖరశర్మ తనిఖీ చేశారు. ఈసందర్భంగా డీఈఓ తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు పలు సబ్జెక్టుల్లో ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. అలాగే, ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు ఏర్పాటుచేసి ఉత్తమ ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అజిత, రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టాలొస్తున్నాయ్..!



భద్రాద్రి జిల్లా జూలూరుపాడు మండలంలో అటవీ అధికారులను అడ్డుకుంటున్న పోడు రైతులు (ఫైల్)

- చివరి అంకానికి చేరిన 'పోడు' ప్రక్రియ
- వివిధ స్థాయిల్లో దరఖాస్తుల పరిశీలన
- 4,359.38 ఎకరాలకు హక్కులు కల్పించేందుకు లైన్‌క్లియర్
- తాజాగా ప్రత్యేక అధికారి యోగితారాణా సమీక్ష

సాక్షిప్రతినిధి, ఖమ్మం: దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న పోడు భూముల సమస్యకు త్వరలోనే పరిష్కారం లభించనుంది. అర్హులైన పోడుదారులకు హక్కు పత్రాలు పంపిణీ చేసేందుకు అధికారులు కసరత్తు ముమ్మరం చేయగా, ప్రక్రియ తుది అంకానికి చేరింది. ఈ మేరకు హక్కుపత్రాల పంపిణీ అంశంపై ఉమ్మడి ఖమ్మం జిల్లా పోడు భూముల ప్రత్యేక అధికారి యోగితా రాణా అధికారులతో సమీక్ష నిర్వహించి.. త్వరగా ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు 3,315 దరఖాస్తులకు సంబంధించి 4,359.38 ఎకరాలకు హక్కుపత్రాలు ఇచ్చేందుకు అంతా సిద్ధం కాగా.. త్వరలోనే హక్కుపత్రాల పంపిణీ ప్రక్రియ ప్రారంభం కానుంది.

ఉధృతంగా పోడు పోరు

జిల్లాలోని పది మండలాల్లో పోడు సమస్య దశాబ్దాల తరబడి వేధిస్తోంది. అనేక మంది గిరిజనులు, గిరిజనేతరులు పోడు వ్యవసాయాన్నే నమ్ముకున్నారు. ఏటా వీరు పోడు భూముల్లో సాగు చేయడం, అటవీ అధికారులు అడ్డుకోవడం సర్వసాధారణమైంది. ఈ క్రమంలో పలుమార్లు అటవీ అధికారులు, పోడుదారులకు మధ్య ఘర్షణ జరిగి కేసులు నమోదయ్యేవి. జిల్లాలో నెలకొన్న ఈ పోడు సమస్య పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు జరిగాయి. దీంతో ప్రభుత్వం అటు అటవీ భూమి అన్యాక్రాంతం కాకుండా.. ఇటు పోడుదారులకు నష్టం కలగకుండా అర్హులకు హక్కు పట్టాలు ఇవ్వడంపై దృష్టి సారించింది.

ఏడాది క్రితం దరఖాస్తుల స్వీకరణ

గతంలో జరిగిన అనేక ఉద్యమాల నేపథ్యాన అర్హులైన పోడుదారులకు పట్టాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2021 నవంబర్ 8 నుంచి పోడుదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలోని పది మండలాల్లో 94 గ్రామపంచాయతీల్లోని 132 ఆవాసాల పోడుదారుల నుంచి అధికారులకు దరఖాస్తులు అందాయి. ఇందులో షెడ్యూల్ తెగలకు సంబంధించి 9,507 మంది 25,515 ఎకరాల్లో హక్కు పత్రాల కోసం, ఇతరులు 8,980 మంది 17,678 ఎకరాలపై హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు. మొత్తంగా 18,487 మంది 43,193 ఎకరాల్లో హక్కు పత్రాల కోసం దరఖాస్తులు ఇవ్వగా, ప్రభుత్వం నియమించిన బృందం సర్వే నిర్వహించింది.

వివిధ స్థాయిల్లో పరిశీలన

పోడు హక్కుల కోసం వచ్చిన దరఖాస్తులకు సంబంధించి క్షేత్రస్థాయిలో సర్వే, విచారణ చేపట్టారు. అలాగే, గ్రామసభలు నిర్వహించి తీర్మానాలు చేశారు. ఈమేరకు షెడ్యూల్ తెగలకు సంబంధించి 6,795 దరఖాస్తులు 13,560 ఎకరాలపై, ఇతరులకు సంబంధించి ఇంకా 2,588 దరఖాస్తులు 2,074.23 ఎకరాలపై గ్రామసభ నిర్ణయాలు పూర్తయ్యాయి. ఇందులో ఖమ్మం డివిజన్ పరిధిలో 3,249 దరఖాస్తులకు గాను 4,232.15 ఎకరాలకు, కల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 694 దరఖాస్తులకు సంబంధించి 693.48 ఎకరాలకు డివిజన్ స్థాయి కమిటీలు సిఫారసు చేశాయి. మిగిలిన దరఖాస్తులకు సంబంధించి డివిజన్ స్థాయి కమిటీ సమావేశాలు జరగాల్సి ఉండగా, ఎస్‌డీఎల్‌సీ(సబ్ డివిజనల్ స్థాయి కమిటీ) సిఫారసు చేసిన దరఖాస్తులపై జిల్లా స్థాయి అటవీ హక్కుల కమిటీలో చర్చించారు.

3,315 దరఖాస్తులకు మోక్షం

అటవీ హక్కు పత్రాల పంపిణీకి సంబంధించిన ప్రక్రియ ఒక్కో అడుగు ముందుకు పడుతోంది. డివిజన్ స్థాయిలో దరఖాస్తులను ఆమోదించి.. తీర్మానాలు చేసి జిల్లా స్థాయి కమిటీలకు పంపించారు. జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఇప్పటి వరకు 3,315 దరఖాస్తులపై 4,359.38 ఎకరాలకు ఆమోదం లభించింది. అయితే అన్ని స్థాయిల్లోనూ మరికొన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, ఉమ్మడి ఖమ్మం జిల్లా పోడు భూముల ప్రత్యేక అధికారిగా నియమితులైన యోగితారాణా బుధవారం ఖమ్మంలో రెండు జిల్లాల అధికారులతో సమీక్షించారు. అర్హులందరికీ పోడు పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నందున దరఖాస్తుల పరిశీలన త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఈమేరకు దరఖాస్తులను గ్రామసభలు, డివిజన్ స్థాయి, జిల్లాస్థాయిలో త్వరగా పరిశీలన చేపట్టి అర్హులందరికీ పోడు భూములపై హక్కు కల్పించాలని సాగుదారులు కోరుతున్నారు.

మొత్తం దరఖాస్తులు, పరిశీలన ఇలా...

	అందిన దరఖాస్తులు		పరిశీలన పూర్తి	
వివరం	దరఖాస్తులు	ఎకరాలు	దరఖాస్తులు	ఎకరాలు
షెడ్యూల్ తెగలు	9,507	25,515	6,795	13,560
ఇతరులు	8,980	17,678	2,588	2,074.23

పేదల సంక్షేమమే లక్ష్యం



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న మంత్రి పువ్వాడ, పక్కన మేయర్ నీరజ, మార్కెట్ చైర్‌పర్సన్ శ్వేత

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ
- 65 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

ఖమ్మంమయూరిసెంటర్: పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెడుతోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. అనారోగ్యంతో బాధపడుతున్న 62మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్‌ఎఫ్) ద్వారా మంజూరైన రూ. 25,13,500 చెక్కులను మంత్రి గురువారం అందజేశారు. జిల్లా కేంద్రంలోని వీడీవోస్ కాలనీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకోలేని వారికి సీఎంఆర్‌ఎఫ్ అండగా నిలుస్తోందని తెలిపారు. చికిత్సకు సాయం అవసరమైన వారు దరఖాస్తు చేసుకోగానే త్వరగా నిధులు మంజూరు చేయిస్తున్నట్లు చెప్పారు.

సమీకృత మార్కెట్ పరిశీలన

నగరంలోని వీడీవోస్ కాలనీలో నిర్మించిన సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌ను మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పరిశీలించారు. మార్కెట్ ప్రారంభానికి సిద్ధం కావడంతో సౌకర్యాలపై ఆరా తీశారు. ఇప్పటికే విక్రయాలు ప్రారంభించిన వ్యాపారులతో మాట్లాడి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పార్కింగ్‌కు ఇబ్బంది లేకుండా చూస్తూనే, తాగునీరు, విద్యుత్ ఏర్పాట్లకు చేయాలని అధికారులకు సూచించారు. నగర ప్రజలకు కూరగాయలు, పండ్లు, మాంసాహారం అన్నీ ఒకే చోట లభించేలా సమీకృత మార్కెట్ నిర్మించగా, త్వరలోనే రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నారని తెలిపారు. ఈకార్యక్రమాల్లో కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ ఆదర్శ్ సురభి, మార్కెట్, సుడా చైర్మన్లు దోరెపల్లి శ్వేత, బచ్చు విజయ్‌కుమార్, వైస్ చైర్మన్ అఫ్జల్, ఏఎంఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్‌లో వ్యాపారితో మాట్లాడుతున్న మంత్రి

ఎఫ్‌పీఓలతో సెర్ప్ డైరెక్టర్ సమీక్ష

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలోని ఫార్మర్ ప్రొక్యూర్‌మెంట్ ఆర్గనైజర్ల(ఎఫ్‌పీవోస్)తో సెర్ప్ డైరెక్టర్ ఎన్.రజిత సమీక్ష నిర్వహించారు. ఖమ్మంలో గురువారం పర్యటించిన ఆమె టీటీడీసీ సమావేశ మందిరంలో జిల్లాలోని నాలుగు ఎఫ్‌పీఓల బాధ్యులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా పనితీరు, శిక్షణ మెళకువలు, వ్యాపార అభివృద్ధిపై చర్చించిన డైరెక్టర్, వ్యాపారంలో అభివృద్ధి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీఆర్ వీసీ మెంబర్ అభిషేక్, డీఆర్డీఓ ఎం.విద్యాచందన, అడిషనల్ డీఆర్డీఓ జయశ్రీ, డీపీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన ఉద్యోగులు, అర్చకుల నిరసనలు

- బీఆర్‌ఎస్ నేతను అరెస్ట్ చేయాల్సిందేనని డిమాండ్
- మంత్రి పువ్వాడ, సీపీకి వినతులు

ఖమ్మంగాంధీచౌక్: దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఖమ్మం డివిజన్ ఇన్‌స్పెక్టర్ సమత ఆత్మహత్యాయత్నానికి కారకుడైన బీఆర్‌ఎస్ నాయకుడు బెల్లం వేణుపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌తో చేపట్టిన ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈమేరకు అర్చకులు, దేవాదాయ శాఖ ఉద్యోగులు గురువారం ఖమ్మం వైరా రోడ్డులోని పవనసుత జలాంజనేయ స్వామి దేవాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. మహిళా ఉద్యోగిని దుర్భాషలాడిన బీఆర్‌ఎస్‌నేత వేణు ఆమె ఆత్మహత్యాయత్నానికి కారకుడయ్యాడని ఆరోపించారు. దేవాలయాల ఆస్తుల రక్షణకు ఉద్యోగులు, అర్చకులు పాటుపడుతుంటే కొందరు ఇలా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. అనంతరం అర్చక, ఉద్యోగులు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్‌ను కలిసి ఘటన పూర్వాపరాలను వివరించారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తోటకూర వెంకటేశ్వర్లు, అర్చకుల సంఘం అధ్యక్షులు దాములూరి వీరభద్రరావుతో పాటు గౌరీశంకర్, కృష్ణమాచార్యులు, వీ.వీ.నర్సింహారావు, హరిచంద్రశేఖర్, డీవీబీ.శర్మ, మురళి, వేణుగోపాలాచార్యులు, ఆమంచి సురేష్, ప్రవీణ్, ఆనంద్, రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మంలో నిరసన తెలుపుతున్న దేవాదాయ శాఖ ఉద్యోగులు, అర్చకులు

వైభవంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం వైభవోపేతంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తహసీల్దార్ల బదిలీలు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో పలువురు తహసీల్దార్లు, తహసీల్దార్ కేడర్ ఉద్యోగులను బదిలీ చేశారు. అలాగే, ఓ తహసీల్దార్‌పై సస్పెన్షన్ ఎత్తేసి పోస్టింగ్ ఇచ్చారు. ఈమేరకు కలెక్టర్ వీ.పీ.గౌతమ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన ఉద్యోగులు నూతన స్థానాల్లో తక్షణమే విధుల్లో చేరాలని సూచించారు. ఖమ్మం ఆర్డీఓ కార్యాలయ ఏఓ కె.శ్రీనివాసరావును కలెక్టరేట్ ఏఓగా, కలెక్టరేట్ ఈ–సెక్షన్ సూపరింటెండెంట్ తుమాటి శ్రీనివాసరావును సింగరేణి తహసీల్దార్‌గా, కలెక్టరేట్ డి–సెక్షన్ సూపరింటెండెంట్ వి.వెంకటేశ్వర్లును అదనంగా కలెక్టరేట్ ధరణి సెక్షన్, లీగల్ సెల్ అప్పగించగా, మధిర తహసీల్దార్ ఆర్.రాంబాబును కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. అలాగే, కలెక్టరేట్‌లో డబుల్ బెడ్‌రూం విభాగం సూపరింటెండెంట్ ఎస్.వీ.నారాయణమూర్తిని వేంసూరు తహసీల్దార్‌గా, కలెక్టరేట్ ఏఓ వి.మదన్ గోపాల్‌ను కలెక్టరేట్ ఈ–సెక్షన్, డబుల్ బెడ్‌రూం సెక్షన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక ఎర్రుపాలెం తహసీల్దార్‌గా పనిచేసిన సమయాన సస్పెన్షన్ గురైన డి.జగదీశ్వరప్రసాద్‌పై సస్పెన్షన్ ఎత్తేసి ఖమ్మం ఆర్డీఓ కార్యాలయ ఏఓగా పోస్టింగ్ ఇచ్చారు.

నేడు 'నిధి ఆప్ కే నిఖత్'

ఖమ్మం సహకారనగర్: ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం 'నిధి ఆప్ కే నిఖత్' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఎం.డీ.సలీంఖాన్ తెలిపారు. ఖమ్మంలోని ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్‌ఓ) కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమంలో రీజినల్ పీఎఫ్ కమిషనర్ వివేక్ రామన్‌రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. సమస్యలు ఎదుర్కొంటున్న ఉద్యోగులు, పెన్షనర్లు హాజరు కావొచ్చని ఆయన తెలిపారు.

నేడు జిల్లాలో రేవంత్ యాత్ర

- మానుకోట జిల్లా మీదుగా ప్రవేశం
- కామేపల్లి మండలంలో యాత్ర చేయనున్న పీసీసీ చీఫ్

ఖమ్మం సహకారనగర్/కామేపల్లి(కారేపల్లి): తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్ర శుక్రవారం జిల్లాలోకి ప్రవేశించనుంది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం లచ్చుతండాకు గురువారం రాత్రి చేరుకున్న ఆయన అక్కడే బస చేశారు. శుక్రవారం ఉదయం కామేపల్లి మండలంలోకి ప్రవేశించి యాత్ర మొదలుపెట్టనున్నారు. లచ్చుతండా నుంచి ప్రారంభమయ్యే యాత్ర బర్లగూడెం, పొన్నేకల్లు మీదుగా, బండిపాడు, బంజర, గోవింద్రాల తండా, పాత లింగాల, కొత్త లింగాల క్రాస్ రోడ్డు వరకు కొనసాగుతుంది. మార్గమధ్యలో ప్రజలు తెలుసుకుంటూ ముందుకు సాగనున్న రేవంత్.. కొత్త లింగాల క్రాస్ వద్ద సాయంత్రం జరిగే బహిరంగ సభలో మాట్లాడారు. ఆతర్వాత వాహనంలో ఇల్లెందుకు చేరుకుని శనివారం పట్టణంలో యాత్ర కొనసాగిస్తారు.

విజయవంతం చేయాలి..

టీ పీసీసీ చీఫ్ చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్రలో పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కోరారు. ఖమ్మం డీసీసీ భవన్‌లో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్ర స్ఫూర్తితో నేరుగా ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు రేవంత్ రెడ్డి ఈ యాత్ర చేపడుతున్నారని తెలిపారు. ఈమేరకు జిల్లా నలుమూలల నుండి కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు హాజరుకావాలని కోరారు. ఇక కామేపల్లిలో ఏర్పాటుచేసిన సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ యాత్ర వివరాలను వెల్లడించారు.



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, పక్కన అన్వేష్‌రెడ్డి, నాయకులు

రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీ..

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీ తప్ప మరేమి కాదని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుంకేట అన్వేష్‌రెడ్డి విమర్శించారు. పంటలకు విద్యుత్ సక్రమంగా సరఫరా కావడం లేదనే అంశంపై అసెంబ్లీలో చర్చకు అవకాశం ఇవ్వాలని సీఎల్పీ బృందం కోరితే అంగీకరించడం లేదని తెలిపారు. ఈమేరకు 13వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇంకా ఈసమావేశాల్లో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్ జావిద్, నాయకులు రాయల నాగేశ్వరరావు, నారాయణరావు, బొందయ్య, హుస్సేన్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకపోతే ఉపేక్షించొద్దు

బేతుపల్లి భూములను పరిశీలించిన జెడ్పీ సీఈఓ

సాక్షి ఎఫెక్ట్..

సత్తుపల్లి: సత్తుపల్లి మండలం బేతుపల్లి సర్వే నంబర్ 133లోని గంగారంలో వివాదాస్పద భూములను జెడ్పీ సీఈఓ అప్పారావు అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. 'సాక్షి'లో ఇటీవల పెద్దరికం పేరిట కబ్జా, కన్నుపడితే ఖతమే!, క్షణాల్లో కాజేశారు.. శీర్షికలతో ఇక్కడి అక్రమాలపై వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో ఇప్పటికే కలెక్టర్ స్పందించి విచారణకు ఆదేశించగా, జెడ్పీ సీఈఓ గురువారం పరిశీలించారు. ఎలాంటి అనుమతి లేకుండానే రియల్ ఎస్టేట్ వెంచర్ వేసిన తీరును చూసి విస్తుపోయిన ఆయన, డీటీసీపీ అప్రూవల్ లేకుండా అంతర్గత రోడ్ల నిర్మాణం, పత్రికల్లో కథనాలు రాగానే ఫెన్సింగ్ తొలగించినట్లు తెలుసుకున్నారు. పంచాయతీల్లో ఈ తరహా అక్రమంగా రియల్ ఎస్టేట్లు ఏర్పాటుచేస్తే ఉపేక్షించవద్దని ఎంపీడీఓ సీహెచ్.సుభాషిణికి సూచించారు. వివాదాస్పద భూముల్లో వేసిన ఫెన్సింగ్‌ను తక్షణం తొలగించాలని ఆదేశించారు. అనంతరం సత్తుపల్లి ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకుని లింక్ డాక్యుమెంట్లు, నాలా కన్వర్షన్, ఏడీఎస్‌ఎల్‌ఆర్ రిపోర్టు, ఈసీలపై సమీక్షించారు.



గంగారంలో రియల్ ఎస్టేట్‌పై సమీక్షిస్తున్న జెడ్పీ సీఈఓ అప్పారావు

ముగిసిన ఆర్డీఓ విచారణ

బేతుపల్లిలోని జరిగిన అక్రమ భూలావాదేవీలపై కల్లూరు ఆర్డీఓ సూర్యనారాయణ చేపట్టిన నాలుగు రోజుల విచారణ ముగిసింది. రెండు, మూడు రోజుల్లో నివేదిక కలెక్టర్‌కు అందించనున్నారు. భూమి రిజిస్ట్రేషన్ బదలాయింపు, నాలా కన్వర్షన్లు, భూమి ఒకచోట ఉండగా మరో చోట భూమికి సంబంధించిన డాక్యుమెంట్లను సమర్పించినట్లు ఆర్డీఓ విచారణలో గుర్తించినట్లు సమాచారం. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారే కాకుండా బాధితులను పిలిపి విచారించిన ఆయన ముత్తా వెంకటేశ్వరరావుకు చెందిన రెండు ఎకరాల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు సాక్ష్యాధారాలు సేకరించినట్లు తెలిసింది.

9మంది టీచర్లకు షోకాజ్

బదిలీకి తప్పుడు పత్రాలు ఇవ్వడమే కారణం

ఖమ్మం సహకారనగర్: విద్యాబుద్ధులు నేర్పించి పిల్లలను సక్రమ మార్గంలో నడిపించాల్సిన ఉపాధ్యాయులు పదోన్నతులు, బదిలీల కోసం తప్పుదోవ పడుతున్నారు. జిల్లాలో బదిలీల సందర్భంగా తప్పుడు ధృవపత్రాలు సమర్పించిన 11మందికి ఇప్పటికే షోకాజ్ నోటీసులు జారీ చేయగా, మరో తొమ్మిది మందికి కూడా నోటీసులు ఇచ్చేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. జిల్లాలో బదిలీలు, పదోన్నతుల కోసం 3065మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోగా... ఇందులో కొందరు అక్రమ మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు సర్టిఫికెట్ల పరిశీలన సందర్భంగా వీరిని అధికారులు గుర్తిస్తున్నారు. రెండు రోజుల క్రితం 11మందికి షోకాజ్ నోటీసులు జారీ చేయగా, మరో 9మంది ఉపాధ్యాయులు కూడా బదిలీలు, పదోన్నతుల కోసం తప్పుడు పత్రాలు సమర్పించినట్లు తేలడంతో శుక్రవారం షోకాజ్ నోటీసులు ఇవ్వనున్నట్లు డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. ఆతర్వాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని డీఈఓ వెల్లడించారు.

ఆత్మీయ పలకరింపు!

నేలకొండపల్లి: జిల్లాలో ఇటీవల జరుగుతున్న రాజకీయ పరిణామాలు రాష్ట్రంలోనే హాట్ టాపిక్‌గా మారాయి. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి బీఆర్‌ఎస్ అధిష్టానంపై తిరుగుబాటు బావుటా ఎగురవేయగా.. ఆ పార్టీ నాయకులు ఆయనపై విమర్శలు ఎక్కుపెడుతున్నారు. ఈనేపథ్యాన నేలకొండపల్లి మండలం బుద్ధారంలో గురువారం జరిగిన వేడుకలో శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎదురుపడ్డారు. సర్పంచ్ శిరీషవాసు కుమారుడి రిసెప్షన్‌కు హాజరైన పొంగులేటి వధూవరులను ఆశీర్వదించి వెళ్తుండగా వేదిక వద్దకు వస్తున్న తుమ్మల ఎదురయ్యారు. దీంతో ఇరువురు కరచాలనం చేసుకుని చిరునవ్వుతో పలకరించుకున్నారు. ఈసందర్భంగా ఇరువురి అనుచరులు జై పొంగులేటి, జై తుమ్మల అంటూ నినాదాలు చేయడం విశేషం.



కరచాలనం చేసుకుంటున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు

క్లుప్తంగా

ఆత్మీయ సమ్మేళనానికి స్థల పరిశీలన



స్థల పరిశీలనలో పాల్గొన్న నాయకులు

వైరా: వైరాలో ఈనెల 15న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యాన జరగనున్న నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనం కోసం ఆయన అనుచరులు గురువారం స్థల పరిశీలన చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ బానోత్ విజయాబాయి ఆధ్వర్యాన స్థల పరిశీలన చేశాక నాయకులు మాట్లాడారు. సమ్మేళనానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి అనుచరులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరానుండగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, నాయకులు తుంబూరి దయాకర్‌రెడ్డి, మిట్టపల్లి నాగి, చింతనిప్పు సుధాకర్, పోలా శ్రీనివాసరావు, జాలాది రామకృష్ణ, దార్న శేఖర్, సంగెపు వెంకన్న, మోదుగు లక్ష్మయ్య, కారుకొండ నరేష్, ఏదునూరి వెంకన్న, పీఆర్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం పన్ను వసూళ్లే లక్ష్యం



మాట్లాడుతున్న సీఈఓ అప్పారావు

పెనుబల్లి/వేంసూరు : జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వంద శాతం ఇంటి పన్ను వసూళ్లే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు వెల్లడించారు. పెనుబల్లి, వేంసూరు మండలాల్లో గురువారం పర్యటించిన ఆయన అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ.. ప్రతీ ఇంటికి వెళ్లి పన్ను చెల్లించేలా అవగాహన కల్పించడమే కాక వ్యాపారులు లైసెన్స్ తీసుకునేలా చూడాలని సూచించారు. అలాగే, గ్రామాల్లో అనుమతి లేకుండా ఏర్పాట్లయ్యే వెంచర్లపై దృష్టి సారించాలని తెలిపారు. ఇంకా గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఈ సమావేశాల్లో ఎంపీడీఓలు కావూరి మహాలక్ష్మి, రమేష్, ఎంపీఓలు రంజిత్, వాల్మీకి కిషోర్ తోపాటు పంచాయతీ కార్యదర్శులు ఎస్.వీ.ప్రసాద్‌రావు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఖబరస్థాన్‌కు స్థలం కేటాయించాలి

ప్రధాన రహదారిపై ముస్లింల రాస్తారోకో



వైరా-మధిర ప్రధాన రహదారిపై బైఠాయించిన ముస్లింలు

వైరారూరల్: మండలంలోని రెబ్బవరంలో ఖబరస్థాన్ ఏర్పాటుకు ప్రభుత్వ స్థలం కేటాయించాలనే డిమాండ్‌తో ముస్లింలు గురువారం ఆందోళన చేపట్టారు. వైరా-మధిర ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించడంతో గంటన్నర పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఏళ్ల తరబడి నుంచి గ్రామంలో ఖబరస్థాన్ లేక మృతదేహాలను చెరువు కట్టపై ఖననం చేయాల్సి వస్తోందని, ఈ విషయమై ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో ఆందోళనకు దిగాల్సి వచ్చిందని తెలిపారు. ఈ సమాచారం తెలుసుకున్న ఎస్సై శాఖమూరి వీరప్రసాద్ గ్రామానికి చేరుకుని ముస్లిం పెద్దలతో చర్చించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఖబరస్థాన్ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

వివాహితపై లైంగిక దాడికి యత్నం

తిరుమలాయపాలెం: మండలంలోని కాకరవాయిలో వివాహితపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన వివాహిత గురువారం ఉదయం గేదెలను తీసుకుని చేను వద్దకు వెళ్తుండగా ఇదే గ్రామానికి చెందిన వీరబోయిన మధు లైంగికదాడికి యత్నించాడు. దీంతో ఆమె కేకలు వేయడంతో మధు పరారయ్యాడు. అనంతరం బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
కందులు	7,000	5,500
మినుములు	7,000	6,900
మిర్చి	18,150	12,000
మిర్చి తాలు	10,000	7,000
పత్తి	7,600	5,500

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,781

పన్ను చెల్లించకపోతే పంపు కట్!

- కేఎంసీ పరిధిలో బకాయిదారులపై దృష్టి
- రెడ్ నోటీసులు.. వారం తర్వాత కనెక్షన్ తొలగింపు
- 35 వేల కనెక్షన్లకు సంబంధించి రూ.6 కోట్ల బకాయిలు



ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో నల్లా పన్నులు చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటూ, ఆదాయ వనరులు పెంచుకోవడంపై అధికారులు సిద్ధమయ్యారు. నగర పాలక సంస్థను మరింత అభివృద్ధి చేసేందుకు గాను అవసరమైన నిధుల కోసం బకాయిలపై దృష్టి సారించారు. కేఎంసీ పరిధిలో 35 వేల నల్లా కనెక్షన్లకు సంబంధించి నుంచి రూ.6 కోట్ల మేర పన్ను బకాయిలు ఉండగా.. ఇందులో కొందరు అనేక ఏళ్ల నుంచి, మరికొందరు రెండు మూడేళ్ల నుంచి చెల్లించడం లేదని గుర్తించారు. దీంతో బకాయిదారుల జాబితా సిద్ధం చేసి పన్ను వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నారు.

మొదట రెడ్ నోటీసులు..

కేఎంసీ నుంచి సేవలు పొందుతూ సకాలంలో పన్నులు చెల్లించకపోవడంతో ఆశించిన మేర ఆదాయం రావడం లేదు. ఆదాయ లోటును పూడ్చుకునేందుకు కేఎంసీ రెవెన్యూ అధికారులు పన్ను బకాయిలను నూరు శాతం వసూలు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే పంపు కనెక్షన్ల బకాయిలుపై ప్రత్యేక దృష్టి సారించి రెడ్ నోటీసులు జారీ చేస్తున్నారు. ఈ నోటీసు అందిన వారంలోగా బకాయి చెల్లిస్తే సరి.. లేకపోతే కనెక్షన్ తొలగించనున్నట్లు బకాయిదారులకు సిబ్బంది వివరిస్తున్నారు.

ఇంజనీరింగ్ అధికారులకు ఒక కాపీ..

పన్ను బకాయిదారులతో పాటు కేఎంసీ ఇంజనీరింగ్ అధికారులకు కూడా నోటీసు కాపీని రెవెన్యూ సిబ్బంది అందజేస్తున్నారు. ఈ నోటీసు అందిన వారం తర్వాత సదరు ఇంటికి ఇంజనీరింగ్ సిబ్బంది వెళ్లి బకాయి చెల్లించారా లేదా అని ఆరా తీస్తారు. బకాయి చెల్లించకపోతే కనెక్షన్ తొలగించనున్నట్లు చెబుతున్నారు. ఈ చర్యలతో బకాయిలను వంద శాతం వసూలు చేయవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

వారంలోగా బకాయిలు చెల్లించాలి

పన్ను బకాయిలన్నింటినీ వసూలు చేయాలని నిర్ణయించాం. కేఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు పంపు కనెక్షన్ల బకాయిదారులకు నోటీసులు అందజేస్తున్నాం. ఈ దఫా రెడ్ నోటీసులను జారీ చేస్తున్నాం. నోటీసు అందుకున్న వారంలోగా బకాయి చెల్లించకపోతే పంపు కనెక్షన్ తొలగించాలని నిర్ణయించాం.

– జి.శ్రీనివాసరావు, రెవెన్యూ ఆఫీసర్, కేఎంసీ

కుటుంబ కలహాలే కారణమా?

- మహిళ మృతిపై పలు అనుమానాలు
- దంపతుల ఆత్మహత్యతో అనాథలుగా కుమారులు



పుట్టా నాగేశ్వరరావు - శ్రీకళ (ఫైల్)

మధిర: కుటుంబ కలహాల నేపథ్యాన దంపతులు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా వారి ఇద్దరి కుమారులు అనాథులుగా మిగిలారు. మండలంలోని మాటూరు గ్రామానికి చెందిన పుట్టా నాగేశ్వరరావు(39) - శ్రీకళ (35) దంపతులు కొంతకాలంగా ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం అనాసాగరంలో తాపీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇటీవల వారి మధ్య కలహాలు జరుగుతున్నట్లు తెలిసింది. ఈక్రమంలోనే 7వ తేదీ మంగళవారం భోజనం క్యారేజీతో పాటు పురుగుల మందు, కూల్‌డ్రింక్‌తో బయలుదేరినట్లు సమాచారం. మోటార్ సైకిల్‌పై వెళ్తూ వత్సవాయి మండలం వేములనరం సమీపాన సుబాబుల్ తోటలో పురుగుమందు తాగిన వారు, నాగేశ్వరరావు బంధువులకు వాట్సాప్ కాల్ చేసి తాము చనిపోతున్నందున పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పినట్లు తెలిసింది. దీంతో ఆందోళనకు గురైన బంధువులు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లేకపోగా బుధవారం నందిగామ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు సెల్ టవర్ లోకేషన్ ఆధారంగా సుబాబుల్ తోటలో మృతదేహాలను గుర్తించిన విషయం విదితమే. కాగా, నాగేశ్వరరావు-శ్రీకళ దంపతులకు పదో తరగతి చదువుతున్న త్రినేష్, ఎనిమిదో తరగతి చదువుతున్న కిరణ్ కుమార్ ఉండగా, వీరిద్దరు మాటూరులోని నాయనమ్మ వద్ద ఉంటున్నారు. క్షణికావేశంలో తల్లిదండ్రులు తీసుకున్న నిర్ణయానికి ఇప్పుడు ఇద్దరు పిల్లలు అనాథలుగా మిగిలినట్లయింది.



అనాథలుగా మిగిలిన పిల్లలు

జగయ్యపేటలో పోస్టుమార్టం..

నాగేశ్వరరావు-శ్రీకళ మృతదేహాలకు ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించగా గురువారం మాటూరులో అంత్యక్రియలు నిర్వహించారు. ఈసందర్భంగా పిల్ల లు రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది. కాగా, శ్రీకళ శరీరంపై గాయాలు ఉన్నట్లు బంధువులు గుర్తించారు. దీంతో తొలుత శ్రీకళను హత్య చేసిన నాగేశ్వరరావు ఆతర్వాత ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, పోస్టుమార్టం నివేదిక వచ్చాక ఈ విషయంలో మరింత స్పష్టత వచ్చే అవకాశముంది.

అఖిల్ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి

రెండు రోజుల్లో మధిర చేరుకునే అవకాశం



ఆస్పత్రిలో అఖిల్ శ్రావిక్ మృతదేహం

మధిర: ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లి తుపాకీ మిస్ ఫైర్ అయిన ఘటనలో మృత్యువాత పడిన మధిరకు చెందిన మహంకాళి అఖిల్ శ్రావిక్(సాయి) మృతదేహానికి అక్కడ పోస్టుమార్టం పూర్తయింది. పట్టణానికి చెందిన మహంకాళి ఉమాశంకర్ – మాధవి దంపతుల పెద్ద కుమారుడు అఖిల్ 2021లో అమెరికా వెళ్లి ఎంఎస్ చేస్తూనే ఒక స్టోర్‌లో పార్ట్ టైం ఉద్యోగం చేస్తున్నారు. భారత కాలమానం ప్రకారం ఈనెల 6న ఉదయం 11 గంటల సమయాన తన స్నేహితుడు రవితేజతో కలిసి స్టోర్ సెక్యూరిటీ గార్డ్ గన్‌ను పరిశీలిస్తుండగా మిస్ ఫైర్ కావడంతో అఖిల్ తలకు తీవ్ర గాయమైంది. దీంతో ఆయనను ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం విదితమే. ఈమేరకు మృతదేహానికి గురువారం పోస్టుమార్టం పూర్తి చేసినట్లు కుటుంబ సభ్యులు సమాచారం అందింది. అనంతరం న్యూజెర్సీ వరకు అఖిల్ మృతదేహాన్ని అక్కడి పోలీసులు తరలించి, తానా ప్రతినిధులు, అఖిల్ స్నేహితులకు అప్పగించారు. ఇమిగ్రేషన్ తదితర ప్రక్రియలు పూర్తయ్యాక అఖిల్ మృతదేహం శనివారం కల్లా స్వస్థలానికి చేరుకునే అవకాశముందని అక్కడి తెలుగు విద్యార్థులు కుటుంబానికి సమాచారం ఇచ్చారు. కాగా, తొలుత అఖిల్ మృతదేహాన్ని ఆయన చదువుకుంటున్న యూనివర్సిటీకి తీసుకెళ్లాలని స్నేహితులు భావించినా, స్వస్థలానికి తరలింపులో మరింత జాప్యం జరుగుతుందని నిర్ణయాన్ని మార్చుకున్నట్లు పలువురు 'సాక్షి'కి తెలిపారు.

హైదరాబాద్‌లో బోనకల్ రైతు ఆత్మహత్యాయత్నం

పరామర్శించిన సీఎల్పీ నేత భట్టి



బాధిత రైతు కుటుంబంతో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఎల్)కు చెందిన రైతు ఇరుగు వెంకటేశ్వర్లు హైదరాబాద్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. గోవిందాపురం(ఎల్)కు చెందిన రైతు వెంకటేశ్వర్లుతో పాటు మరికొందరు సాగు చేసిన మొక్కజొన్న పంటను హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి నాగభూషణం కొనుగోలు చేశాడు. అయితే, డబ్బులు ఇవ్వకుండా తిప్పిస్తుండడంతో బాధిత రైతులు గురువారం హైదరాబాద్ వెళ్లారు. వ్యాపారిని డబ్బు ఇవ్వమని అడగడంతో ఆయన తిట్టడమే కాకుండా చేయి చేసుకోవడంతో మనస్థాపం చెందిన వెంకటేశ్వర్లు పురుగుల మందు తాగాడు. దీంతో ఆయనను అక్కడి ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించారు. ఈవిషయం తెలుసుకున్న సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి తదితరులు ఆస్పత్రికి వెళ్లి రైతును పరామర్శించారు. డబ్బు చెల్లించకపోవడమేకాక దాడికి పాల్పడిన వ్యాపారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భట్టి విక్రమార్క ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

లోన్ యాప్ వేధింపులు తాళలేక యువకుడు..

రఘునాథపాలెం: ఆన్‌లైన్ యాప్ ద్వారా రుణం తీసుకున్న ఓ యువకుడు.. ఆపై ఒత్తిళ్లు భరించలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మండలంలోని బావోజీతండాకు చెందిన భూక్యా ఆకాష్(17) ఇంటర్ ఫెయిల్ అయ్యాక ఖమ్మంలోని జ్యూయెలరీ షాపులో పనిచేస్తున్నాడు. ఖర్చులకు డబ్బు అవసరమై ఆరు నెలల క్రితం ఆన్‌లైన్ యాప్‌లో రూ.10 వేల రుణం తీసుకున్నాడు. కానీ, సకాలంలో చెల్లించకపోవడంతో యాప్ నిర్వాహకుల నుంచి ఒత్తిడి మొదలైంది. వేర్వేరు ఫోన్ల ద్వారా ఫోన్ చేసి వేధిస్తుండడం, బంధువులు, స్నేహితులకు చెబుతామని బెదిరిస్తుండడంతో ఈనెల 1న తాను పనిచేసే జ్యూయెలరీ షాపులో ఆభరణాలు శుభ్రం చేసే రసాయనం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో కుటుంబీకులు ఆస్పత్రిలో చేర్పించగా, కారణం చెప్పని ఆకాశ్ ఇటీవల ఆరోగ్యం క్షీణిస్తుండడంతో యాప్ నిర్వాహకుల వేధింపులను చెప్పినట్లు తెలిసింది. కాగా, ఈఘటనకు సంబంధించి తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి...

తిరుమలాయపాలెం: మండలంలోని కొక్కిరేణిలో ఓ వ్యక్తిపై భార్యభర్తలు దాడి చేయగా మనస్తాపంతో ఆయన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన గోవింద వెంకన్న, పల్లెల చిరంజీవి ఓ రైతు వద్ద పాలేర్లుగా పనిచేస్తున్నారు. వీరి నడుమ ఇటీవల వివాదం చోటు చేసుకోగా, వెంకన్న ఈనెల 5న చిరంజీవిపై దాడి చేశాడు. అలాగే, వెంకన్న భార్య కౌసల్య 6వ తేదీన చిరంజీవిపై దాడి చేసింది. దీంతో మనస్థాపానికి గురైన చిరంజీవి పంటచేను వద్ద పురుగుల మందు తాగగా, కుటుంబీకులు ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించారు. బాధితుల ఫిర్యాదు మేరకు గోవింద వెంకన్న, కౌసల్యపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రూ.లక్ష విలువైన గంజాయి స్వాధీనం

ఖమ్మంక్రైం: ఖమ్మం రైల్వేస్టేషన్‌లో చేపట్టిన తనిఖీల్లో జీఆర్పీ సిబ్బంది గురువారం రూ.లక్ష విలువైన గంజాయి స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్‌లోని రెండో నంబర్ ప్లాట్‌ఫాంపై తనిఖీ చేస్తుండగా, మూత్రశాలల వద్ద ఓ బ్యాగ్‌ను పోలీసులు గుర్తించారు. అందులో పరిశీలించగా రూ.లక్ష విలువైన ఐదు కేజీల గంజాయి ఉండడంతో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై భాస్కర్‌రావు తెలిపారు. గంజాయి ఎవరు తీసుకొచ్చారనే అంశంపై విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు.

యువతి అదృశ్యం.. ఆచూకీ లభ్యం

కారేపల్లి: పరీక్ష రాసేందుకు వెళ్లిన యువతి తిరిగి రాకపోవడంతో ఆమె బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేసి గాలిస్తుండగా, హైదరాబాద్ వెళ్లినట్లు ఆమె ఫోన్ చేయడంతో ఊపిరి పీల్చుకున్నారు. మండలంలోని కొత్తకమలాపురానికి చెందిన యువతి ఇల్లెందులో డిగ్రీ పరీక్షలు రాసేందుకు బుధవారం ఇంటి నుంచి వెళ్లింది. తిరిగి రాత్రి రాకపోవడంతో గురువారం ఉదయం యువతి బంధువులు కారేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంతలోనే ఆమె హైదరాబాద్‌లోని స్నేహితుల వద్దకు వెళ్లినట్లు కుటుంబీకులకు ఫోన్ చేయగా పోలీసులకు సమాచారం ఇచ్చారు.

పొక్లెయినర్ దగ్ధం



దగ్ధమవుతున్న పొక్లెయినర్

రఘునాథపాలెం: రఘునాథపాలెంలోని ఒక క్రషర్ మిల్లులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పొక్లెయినర్ దగ్ధమైంది. క్రషర్ మిల్లులో గురువారం పని జరుగుతుండగా, పొక్లెయినర్‌లో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగాయి. దీంతో సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ ఉద్యోగులు చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే, అప్పటికే వాహనం దగ్ధం కాగా, సుమారు రూ.10 లక్షల మేర నష్టం జరిగిందని యజమాని ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

కారేపల్లి: ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టిన ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. కారేపల్లి మండలం గుట్టకిందిగుంపు గ్రామానికి చెందిన శీలం వెంకటేశ్వర్లు ఇల్లెందులోని తమ బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి గురువారం టీవీఎస్ ద్విచక్రవాహనంపై వెళ్లి వస్తున్నాడు. ఈ క్రమంలో ఇల్లెందు – ఉసిరికాయలపల్లి ఓసీ సరిహద్దులో వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్లును ఇల్లెందు ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

పకడ్బందీగా ఇంటర్ ప్రాక్టికల్స్ నిర్వహణ

జిల్లా ఇంటర్ విద్యాధికారి రవిబాబు



మాట్లాడుతున్న డీఐఈఓ రవిబాబు(ఎడమ)

నేలకొండపల్లి: జిల్లాలో ఇంటర్‌మీడియట్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి(డీఐఈఓ) కె.రవిబాబు తెలిపారు. మండల కేంద్రానికి గురువారం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఇంటర్‌మీడియట్ ప్రాక్టికల్స్ ఈనెల 15 నుంచి నిర్వహించనుండగా, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇక ఇంటర్ వార్షిక పరీక్షలకు 127 కాలేజీల నుంచి 36 వేల మంది విద్యార్థులు హాజరుకానుండడంతో 63 కేంద్రాలను గుర్తించినట్లు వివరించారు. ప్రభుత్వ కాలేజీ విద్యార్థులకు ఎంసెట్ శిక్షణ కూడా ఇస్తుండగా, వెనకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులను చేపట్టినట్లు తెలిపారు. కాగా, కాలేజీలో అధ్యాపకులకు బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి చేశామని డీఐఈఓ వెల్లడించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ కాలేజీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఆర్.ఆమోస్, వసుంధర కాలేజీ కరస్పాండెంట్ ఈగ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గొల్ల, కురుమలకు గొర్రెలు పంపిణీ చేయండి

అసెంబ్లీలో సత్తుపల్లి ఎమ్మెల్యే వెంకటవీరయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి: డీడీలు చెల్లించి వేచి చూస్తున్న గొల్ల, కురుమలకు గొర్రెల యూనిట్లు పంపిణీ చేయాలని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గురువారం మాట్లాడిన ఆయన రాష్ట్రవ్యాప్తంగా పలువురు డీడీలు కట్టి యూనిట్ల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఈమేరకు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. ఇప్పటికే డీడీలు కట్టిన వారే కాకుండా మిగిలిన వారిలో అర్హులందరికీ నాలుగైదు నెలల్లో గొర్రెల యూనిట్లు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు.

ఆటో బోల్తా.. పది మంది కూలీలకు గాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన ఆటో

కూసుమంచి: ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తా కొట్టగా పది మందికి గాయాలయ్యాయి. వివరాలు.. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం చనుపల్లి గ్రామానికి చెందిన కూలీలు కూసుమంచి మండలంలోని నేలపట్లలో ఓ రైతు చేనులో మిర్చి ఏరేందుకు ఆటోలో వస్తున్నారు. ఈక్రమంలో వీరన్న స్వామి ఆలయం వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఆటో డ్రైవర్ తప్పించే క్రమంలో బోల్తా కొట్టింది. దీంతో కూలీలపై ఆటో పడగా గాయాలపాలయ్యారు. రహదారిపై వెళ్తున్న వాహనదారులు ఆటోను లేపి కూలీలను 108లో ఆస్పత్రికి తరలించారు. ఈఘటనలో గొట్టిముక్కల ఉమ, పద్మకు తీవ్ర గాయాలు కాగా, మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి.

ముగిసిన జ్యోతి అంత్యక్రియలు

కూసుమంచి: మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ నల్లమల బాలకృష్ణ భార్య జ్యోతి మృతదేహానికి మండలంలోని కేశ్వాపురంలో అంత్యక్రియలు పూర్తయ్యాయి. మంచిర్యాలలో ఆమె మంగళవారం ఆత్మహత్యకు పాల్పడగా, పోస్టుమార్టం అనంతరం బుధవారం కేశ్వాపురానికి మృతదేహాన్ని తీసుకొచ్చిన బంధువులు బాలకృష్ణ ఇంటి ఎదుట ఆందోళనకు దిగిన విషయం విదితమే. బాలకృష్ణతో పాటు ఆయన తల్లి వేధింపులతోనే ఆత్మహత్య చేసుకుందని ఆరోపించారు. ఆస్తి మొత్తాన్ని జ్యోతి పిల్లల పేరిట రాయించాకే అంత్యక్రియలు నిర్వహిస్తామని పట్టుబట్టడంతో గ్రామ పెద్దలు చర్చించారు. ఈమేరకు నగదు, స్థిరాస్తులను పిల్లల పేర రాయించడంతో గురువారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. అప్పటి వరకు గ్రామంలో ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి

టేకులపల్లి: ఇసుక ట్రాక్టర్ ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. టేకులపల్లి ఎస్సై భూక్య శ్రీనివాస్ నాయక్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. సింగరేణి మండలం పోలంపల్లి పంచాయతీ మోకాళ్లగుంపు గ్రామానికి చెందిన ఆరెం వేణు(20) టేకులపల్లి మండలం తడికలపూడిలో తన పెద్దనాన్న ఇంటికి మూడు రోజుల క్రితం వచ్చాడు. బుధవారం రాత్రి తన బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. తడికలపూడి రోడ్డులో కల్వర్టు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. గురువారం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ట్రాక్టర్ డ్రైవర్ గుగులోత్ సైదులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నాలుగు ఉమ్మడి జిల్లాల్లో బైకు యాత్ర చేస్తా

భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండ/ఇబ్రహీం పట్నం: దక్షిణ తెలంగాణలోని నాలుగు ఉమ్మడి జిల్లాల్లో తాను బైకు యాత్ర నిర్వహిస్తానని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. ఈ నెల 13న పార్లమెంట్ సమావేశాలు ముగుస్తాయని, ఆ తరువాత యాత్ర ప్రారంభిస్తానని వెల్లడించారు. బైకు యాత్ర అయితే ఎక్కువ గ్రామాలు తిరిగేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. గురువారం ఆయన నల్లగొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌గర్, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాలో యాత్ర ఉంటుందని, ఈ విషయం అధిష్టానానికి కూడా చెప్పానని వివరించారు. ధరణి పోర్టల్‌తో ఎంతో మంది ఇబ్బందులు పడతున్నారని, రోజూ తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని చెప్పారు. ప్రగతి భవన్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కోమటిరెడ్డి స్పందిస్తూ.. ప్రగతి భవన్ ప్రజల సొత్తని, అది కేసీఆర్‌ది కాదని అన్నారు. గతంలో వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజా దర్బారు పెట్టి రోజూ సామాన్య ప్రజలను కలసి వారి సమస్యలను పరిష్కరించారని చెప్పారు. ఆనాడు వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల కోసం ఆరోగ్య శ్రీ, 104, 108 వంటి పథకాలను పెడితే తెలంగాణ ప్రభుత్వం వాటిని నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. 108, 104లో పనిచేసే ఉద్యోగులకు కూడా నెలల తరబడి వేతనాలు ఇవ్వడం లేదన్నారు. కాగా, హైదరాబాద్- విజయవాడ హైవే విస్తరణకు ప్రధాన మంత్రిని కలసి ఓకే చేయించానని వెంకట్‌రెడ్డి చెప్పారు. దీని కోసం రూ.1,600 కోట్లు మంజూరు చేయడానికి ఆయన అంగీకరించారని, త్వరలో పనులు ప్రారంభం అవుతాయని చెప్పారు.

ఓబీసీల్లో వీరశైవ లింగాయత్ సహా 24 ఉప కులాలు

చేర్చాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ వినతి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రల్లోని వీరశైవ లింగాయత్ కులంతో పాటు 24 ఉపకులాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ కోరారు. వీరశైవ లింగాయత్, 24 ఉపకులాల ప్రతినిధులతో కలిసి గురువారం జాతీయ బీసీ కమిషన్ (ఎన్సీబీసీ) చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాం అహిర్‌ను ఢిల్లీలో కలిసి వినతిపత్రం సమర్పించారు. వీర శైవ లింగాయత్ కులం, సంచారజాతులైన బుక్క అయ్యవారాస్, గోత్రాల, బొద్దిలి, ఆరె మరాఠి మరాఠ సహా మొత్తం 24 ఉప కులాలను ఓబీసీల్లోకి చేర్చాలని విజ్ఞప్తి చేశారు.

రైతులకు మేలు చేసేందుకే ధరణి

- శాసనసభలో మంత్రి వేముల
- 13 లక్షల ఫిర్యాదులొస్తే 12 లక్షలు పరిష్కారం
- రెండేళ్ళలో 24 లక్షల లావాదేవీలు



సాక్షి, హైదరాబాద్: వివాదాల్లేకుండా, భూరికార్డులను భద్రపర్చి రైతులకు మేలు చేసేందుకే ధరణి పోర్టల్ తీసుకొచ్చామని శాసనసభా వ్యవహారాల మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ధరణిలో భూమి నమోదు కాలేదని ఇప్పటివరకూ 13 లక్షల ఫిర్యాదులొస్తే 12 లక్షలు పరిష్కరించినట్టు చెప్పారు. రైతుకు తన భూమిపై పూర్తి హక్కు కల్పించే ధరణిని విపక్షాలు అడ్డుకోవడం విడ్డూరమన్నారు. గురువారం శాసనసభలో పలు పద్దులపై చర్చకు మంత్రి సమాధానమిచ్చారు.

పైరవీకారుల రాజ్యాన్ని తెచ్చేందుకే..

రైతులను పీడించే పైరవీకారుల రాజ్యాన్ని మళ్ళీ తెచ్చేందుకే కాంగ్రెస్ పార్టీ ధరణిని వ్యతిరేకిస్తోందని ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. సాదా బైనామా ద్వారా భూమి రికార్డుల్లోకి ఎక్కించేందుకు 2016లోనే కాకుండా 2020లోనూ అవకాశం కల్పించామని, ఈ దశలోనే కోర్టు కేసు వల్ల ఇది ఆగిపోయిందన్నారు. ఈ రెండేళ్లలో ధరణి ద్వారా 24 లక్షల లావాదేవీలు జరిగాయని, కేవలం 15 నిమిషాల్లోనే లావాదేవీ పూర్తవుతోందని తెలిపారు. ధరణిలో 33 మాడ్యూల్స్ ఇవ్వడం వల్ల, ప్రతి గ్రామంలోనూ సమస్య పరిష్కారం దిశగా కృషి చేయడం వల్ల సమస్యలు తగ్గుతున్నాయని చెప్పారు.

58, 92 జీవోల ద్వారా క్రమబద్ధీకరణ

125 గజాలున్న 1.25 లక్షల మంది పేదలకు 58 జీవో ద్వారా ఇళ్ళ జాగాలను క్రమబద్ధీకరించామని, ఇళ్ళు కట్టుకున్న 36 వేల మంది పేదలకు 59 జీవో ద్వారా క్రమబద్ధీకరణ చేశామని ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ ఎల్‌బీ నగర్‌లో భవంతులు ఉన్న 44 కాలనీల్లో రెగ్యులైజేషన్ చేపట్టి, యజమానుల్లో ఆందోళన తగ్గించామని చెప్పారు. 2.92 లక్షల మందికి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో 1.38 లక్షలు పూర్తి చేశామని, మరో 45 వేలు 90 శాతం పూర్తయ్యాయని, 35 వేలు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఈ పథకానికి రూ. 11,639 కోట్లు ఖర్చవుతుంటే కేంద్రం ఇచ్చింది కేవలం రూ.1,311 కోట్లు మాత్రమేనన్నారు.

వక్ఫ్ భూములు పరిరక్షిస్తాం

ఆదాయంలో రిజిస్ట్రేషన్ల శాఖ 3వ స్థానంలో ఉందని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. వక్ఫ్ భూముల పరిరక్షణకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇందుకు సంబంధించిన న్యాయపరమైన చర్యలు చేపట్టిందని చెప్పారు. ప్రతి గ్రామంలోనూ రోడ్ల మరమ్మతు పనులు చేస్తున్నామని, గ్రామం నుంచి మండలానికి బీటీ రోడ్డు, మండలం నుంచి జిల్లాకు డబుల్ రోడ్డు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన చెప్పారు.

50 సీట్లలో పోటీపై సరైన సమయంలో నిర్ణయం

- ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ
- అసెంబ్లీలో కేటీఆర్‌తో భేటీ
- తాజ్‌మహల్ కంటే అందంగా తెలంగాణ సెక్రటేరియట్ ఉందంటూ ప్రశంస



సాక్షి, హైదరాబాద్: వచ్చే శాసనసభ ఎన్నికల్లో తెలంగాణలో 50 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసే అంశంపై సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటామని ఏఐఎంఐఎం అధినేత, లోక్‌సభ సభ్యులు అసదుద్దీన్ ఒవైసీ వెల్లడించారు. ఎన్నికలకు చాలా సమ యం ఉందని అంటూనే అక్టోబర్ నాటికి నిర్ణయం తీసుకుంటామనే అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్ర అసెంబ్లీ వార్షిక బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో అసదుద్దీన్ ఒవైసీ గురువారం రాత్రి అసెంబ్లీకి వచ్చారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుతో భేటీ అనంతరం మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. కేసీఆర్ జాతీయ రాజకీయాల్లోకి రావడం మంచి పరిణామమని పేర్కొంటూ, తెలంగాణలో బీఆర్‌ఎస్ పాలన బాగుందని కితాబునిచ్చారు. బీఆర్‌ఎస్ దేశవ్యాప్తంగా విస్తరించి జాతీయ రాజకీయాల్లోకి రావడం మంచిదేనని అసదుద్దీన్ అన్నారు. ఎంఐఎం పార్టీ బీజేపీకి బీ టీమ్ అంటూ కాంగ్రెస్ నేతలు ప్రచారం చేస్తున్నారని, తాము ఎవరికీ బీ టీమ్ కాదన్నారు. బీజేపీని ఓడించాల్సిన అవసరముందన్నారు. అదానీ అంశంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలనే డిమాండ్‌కు ప్రధాని మోదీ ఒప్పుకోవడం లేదని చెప్పారు. తాజ్‌మహల్ కంటే అందంగా తెలంగాణ కొత్త సచివాలయాన్ని కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిందని ప్రశంసించారు. ఈ నెల 17న జరిగే సచివాలయం ప్రారంభోత్సవం అధికారిక కార్యక్రమం అయినందున తాము కూడా వెళ్తామన్నారు. అయితే సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరిగే బహిరంగ సభతో తమ పార్టీకి సంబంధం లేదన్నారు. పరేడ్ మైదానంలో జరిగే బహిరంగ సభకు ఇతర పార్టీలను ఆహ్వానించడం బీఆర్‌ఎస్‌కు సంబంధించిన విషయమని ఎంపీ అసదుద్దీన్ వ్యాఖ్యానించారు. మండలి స్థానిక సంస్థల కోటా ఎన్నికలో తమ పార్టీ అభ్యర్థికి బీఆర్‌ఎస్ మద్దతు కోరేందుకు సమయముందని, కేటీఆర్‌తో భేటీలో ఈ అంశం ప్రస్తావనకు రాలేదని చెప్పారు.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ షెడ్యూల్‌పై చర్చ

మండలి స్థానిక సంస్థల కోటాలో హైదరాబాద్ నుంచి ఎన్నికైన ఎంఐఎం ఎమ్మెల్సీ సయ్యద్ అమీనుల్ హసన్ జాఫ్రీ పదవీకాలం మేలో ముగియనుంది. ఖాళీగా ఉన్న స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ స్థానం ఎన్నికకు షెడ్యూల్ ప్రకటన నేపథ్యంలో మంత్రి కేటీఆర్‌తో అసద్ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుతం మండలిలో ఎంఐఎంకు ఇద్దరు సభ్యులుండగా, రెండు స్థానాలూ గతంలో బీఆర్ఎస్ మద్దతుతోనే సాధించింది. ప్రస్తుతం జీహెచ్ఎంసీలో బీఆర్‌ఎస్ సంఖ్యాపరంగా అతిపెద్ద పార్టీ కావడంతో మళ్లీ ఈ స్థానాన్ని తమకు కేటాయించాలని కోరేందుకు ఆయన అసెంబ్లీకి వచ్చినట్లు సమాచారం. కాగా స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ స్థానంలో ఎంఐఎంకు మద్దతుకు సంబంధించి బీఆర్‌ఎస్ ఒకట్రెండు రోజుల్లో వైఖరి వెల్లడించే అవకాశమున్నట్లు తెలిసింది.

తెలంగాణ బడ్జెట్ సమావేశాలు 2023-24

‘రైతులు క్వింటాలుకు 8 కిలోలు నష్టపోతున్నారు’



సాక్షి, హైదరాబాద్: కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయిస్తున్నప్పటికీ, మిల్లర్ల పెత్తనంతో క్వింటాలుకు 7–8 కిలోల ధాన్యాన్ని నష్టపోతున్నారని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆందోళన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతు ధాన్యం విక్రయించగానే వాహనాలకు ట్రిప్ షీట్ ఇవ్వకపోవడంతో మిల్లర్లు రైతులను పిలిపించి సాకులు చూపుతూ క్వింటాలుపై 8 కిలోల వరకు ధాన్యాన్ని అదనంగా తీసుకుంటున్నారన్నారు. అసెంబ్లీలో గురువారం పద్దులపై చర్చ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పౌరసరఫరాల సంస్థ నుంచి తీసుకునే బియ్యానికి డబ్బులు చెల్లించకపోవడంతో రూ. 20వేల కోట్లు బకాయిలుగా పేరుకుపోయాయని, వాటిని వెంటనే చెల్లించాలన్నారు. రేషన్ కార్డుల జారీని ఎన్నికలకే పరిమితం చేయకుండా అర్హులకు కుటుంబాలకు అందజేయాలని కోరారు. ఎక్సైజ్ ఆదాయం కోసం బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నారని, వెంటనే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

‘మండలి’ డిప్యూటీ చైర్మన్‌గా బండా ప్రకాశ్!

- ఏడాదిన్నర తర్వాత శాసన మండలికి డిప్యూటీ చైర్మన్
- నేడు నోటిఫికేషన్, 11న నామినేషన్, 12న ఎన్నిక
- అదే రోజు కొత్త డిప్యూటీ చైర్మన్ బాధ్యతల స్వీకరణ
- త్వరలో మండలి చీఫ్ విప్, విప్‌ల నియామకం?



సాక్షి, హైదరాబాద్: సుమారు ఏడాదిన్నరగా ఖాళీగా ఉన్న శాసన మండలి డిప్యూటీ చైర్మన్ ఎన్నికకు రంగం సిద్ధమైంది. ఈ ఎన్నికకు సంబంధించి శుక్రవారం నోటిఫికేషన్ వెలువడనుండగా, 11వ తేదీన నామినేషన్ల స్వీకరణ, పరిశీలన తదితరాలు పూర్తి చేస్తారు. 12న ఉదయం 10 గంటలకు శాసన మండలి ప్రారంభమైన అనంతరం డిప్యూటీ చైర్మన్ ఎన్నిక ప్రక్రియను పూర్తి చేసి బాధ్యతలు అప్పగిస్తారు. కాగా శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ బండా ప్రకాశ్ ముదిరాజ్ ఎన్నిక దాదాపు ఖాయమైంది. ఆయన పేరును బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఖరారు చేశారు. దీంతో ఈ నెల 11న శాసన మండలి డిప్యూటీ చైర్మన్ ఎన్నికకు సంబంధించి నామినేషన్ పత్రాలు దాఖలు చేసేందుకు బండా ప్రకాశ్ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుంచి శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా వ్యవహరించిన నేతి విద్యాసాగర్ 2021 జూన్ 3న ఎమ్మెల్సీగా తన పదవీ కాలం పూర్తి చేసుకున్నారు. అప్పటి నుంచి శాసన మండలి డిప్యూటీ చైర్మన్ పదవికి ఎన్నిక జరగకపోవడంతో సుమారు ఏడాదిన్నరగా ఖాళీగా ఉంది. ఇదిలా ఉంటే 2018 మార్చిలో బీఆర్‌ఎస్ తరఫున రాజ్యసభకు ఎన్నికైన బండా ప్రకాశ్ ఎంపీగా ఆరేళ్ల పదవీ కాలం పూర్తి చేయకుండానే 2021 నవంబర్‌లో ఎమ్మెల్యే కోటాలో శాసన మండలికి ఎన్నికయ్యారు. అనంతరం 2021 డిసెంబర్ మొదటి వారంలో బండా ప్రకాశ్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఇదిలా ఉంటే ప్రస్తుతం శాసన మండలిలో డిప్యూటీ చైర్మన్‌తో పాటు ప్రభుత్వ చీఫ్‌విప్, మరో రెండు విప్ పదవులు కూడా ఖాళీగా ఉన్నాయి. స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్ ఒక్కరే ప్రస్తుతం మండలిలో ప్రభుత్వ విప్‌గా వ్యవహరిస్తున్నారు. డిప్యూటీ చైర్మన్ ఎన్నిక ముగిశాక మండలి చీఫ్ విప్, విప్ పదవుల భర్తీ జరుగుతుందని బీఆర్‌ఎస్ వర్గాలు చెప్తున్నాయి.

వక్ఫ్‌భూములు ఎవరి జాగీర్లు కావు

- భూ చట్టాల పేరిట ముస్లింలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలి
- బీసీలకు కేటాయించిన బడ్జెట్ ఖర్చు చేయడంలో అన్యాయం
- ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వక్ఫ్ భూములు ఎవరివో తెలియని పరిస్థితి నెలకొందని ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పటి నుంచి భూ చట్టాల పేరిట ముస్లింలు భూములు కోల్పోయారని, ఇనాం భూములు, జాగీర్ భూములు పోయి పేదలుగా మారారని, వారికి జరిగిన అన్యాయాన్ని సవరించాలని కోరారు. వక్ఫ్ భూముల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అసెంబ్లీలో బడ్జెట్ పద్దులపై జరిగిన చర్చ సందర్భంగా అక్బరుద్దీన్ మాట్లాడుతూ వక్ఫ్ భూములెవరి జాగీర్లు కావని, దేవుడి ఆస్తి అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని వక్ఫ్‌భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టారని ఆరోపించారు. ప్రస్తుతం వక్ఫ్‌భూముల్లో రూ.100, రూ 200తో అద్దెలకు ఉంటున్న వారు ఆ అద్దెలను కూడా చెల్లించడం లేదని, సంవత్సరాలుగా తిష్టవేశారన్నారు. వక్ఫ్, దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న కొన్ని భూముల పత్రాలు పర్షియన్ భాషలోఉన్నాయని, వాటిని ట్రాన్స్‌లేట్ చేయించాలని కోరారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఉన్నత విద్యా కమిటీలలో ముస్లింలకు ప్రాతినిధ్యం కల్పించాలని అక్బరుద్దీన్ కోరారు. బీసీల సంక్షేమం విషయంలో ప్రభుత్వం పట్ల అసంతృప్తి నెలకొందని, గత ఏడాది బడ్జెట్‌లో రూ.6వేల కోట్లు కేటాయిస్తే కేవలం రూ.417 కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. 2014 నుంచి 2023 వరకు బీసీల సంక్షేమానికి అయిన ఖర్చు అసంతృప్తిని మిగిల్చిందని, ఈసారి బీసీలకు బడ్జెట్ కేటాయింపులకు అనుగుణంగా నిధులు విడుదల చేయాలని కోరారు. దళితబంధు తరహాలో బీసీబంధు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో సంక్షేమ పథకాలు భేష్

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో చేసిన కేటాయింపుల పట్ల పూర్తి సంతృప్తి వ్యక్తం చేసిన అక్బరుద్దీన్ ఒవైసీ... రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమ పథకాలను కొనియాడారు. ఏ రాష్ట్రంలో లేనివిధంగా ముస్లిం మైనారిటీల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఉర్దూను రెండో అధికారిక భాషగా ప్రకటించిన రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. ముస్లింలకు ప్రతినిధిగా వ్యవహరిస్తున్నప్పటికీ తాను హిందూ, క్రిస్టియన్, సిక్కులు తదితర అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం పనిచేస్తున్నట్లు అక్బరుద్దీన్ చెప్పారు.

ఆయిల్‌పామ్ సాగుకు అంతా అనుకూలం



సదస్సులో మాట్లాడుతున్న మరియన్న

దమ్మపేట: రాష్ట్రంలోనే అశ్వారావుపేట, దమ్మపేట మండలాలు ఆయిల్‌పామ్ సాగుకు అత్యంత అనుకూలంగా ఉన్నాయని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉద్యాన శాఖ అధికారి జినుగు మరియన్న తెలిపారు. మండలంలోని పట్వారిగూడెంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు గురువారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్టంలోనే దమ్మపేట, అశ్వారావుపేట మండలాలు ఆయిల్‌పామ్ హబ్‌గా ఉన్నాయని తెలిపారు. ఇక్కడి నేలలు సాగుకు అనుకూలంగా ఉన్నందున మరింత మంది రైతులు ముందుకు రావాలని కోరారు. ఏడీఏ అఫ్జల్‌బేగం మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్‌లో అంతర పంటలుగా కూరగాయలు సాగు చేయడంతో పాటు రసాయన ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, ఆయిల్ పామ్ డివిజనల్ మేనేజర్ బాలకృష్ణతో పాటు కొయ్యల అచ్యుతరావు, చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం



భద్రాచలం: వచ్చే విద్యా సంవత్సరం గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 6, 7, 8వ తరగతుల్లో ఖాళీ అయ్యే సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు తెలిపారు. అలాగే, ఖమ్మం జిల్లాలోని స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల (బాలురు)ల్లో ఎనిమిదో తరగతిలో ప్రవేశాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు మార్చి 7వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే ఏప్రిల్ 16న ఎంపిక చేసిన కేంద్రాల్లో పరీక్ష నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. ఇక ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి(ఇంగ్లిష్ మీడియం)లో ప్రవేశానికి గిరిజన బాలబాలికలు ఆన్‌లైన్‌లో మార్చి 6వ తేదీలోగా రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని పీఓ పేర్కొన్నారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు.

నెరవేరిన సెర్ప్ ఉద్యోగుల కల

- ఫలించిన 23 ఏళ్ల పే స్కేల్‌పోరాటం
- ఉమ్మడి జిల్లాలో 342 మందికి లబ్ధి



జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖలో విధులు నిర్వర్తిస్తున్న సెర్ప్ ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల అభివృద్ధి, సాధికారతే లక్ష్యంగా పని చేస్తున్న సెర్ప్ ఉద్యోగుల కల సాకారమైంది. ఏళ్లుగా ఎదురుచూస్తున్న సెర్ప్ ఉద్యోగులకు పే స్కేల్ అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అంతేకాక ఈ ఏడాది బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పడంతో పాటు ఏప్రిల్ నుంచే పెంచిన వేతనాలు అమలులోకి వస్తాయని వెల్లడించింది. దీంతో ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

మహిళకు అండగా...

గ్రామీణ ప్రాంత మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా లింకేజీ రుణాలు మంజూరు చేస్తోంది. ఈ రుణాల మంజూరు సాఫీగా సాగడంతో పాటు మహిళాసంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకునేలా చూడడంలో సెర్ప్ ఉద్యోగులు కీలకంగా వ్యవహరిస్తున్నారు. కోవిడ్ సమయంలోనూ సెర్ప్ సిబ్బంది మహిళా సాధికారత కోసం పనిచేశారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టే అనేక పథకాలు గ్రామీణులకు అందించేందుకు వారి సేవలు ఉపయోగించుకుంటున్నారు. ఈ నేపథ్యాన వారు పే స్కేల్‌తో పాటు హెల్త్ స్కీమ్ కోసం పోరాడుతుండగా ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది.

ఫలించిన పోరాటం..

సెర్ప్ ఉద్యోగులకు పే స్కేల్ అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఇవ్వడమే కాక హెల్త్ స్కీమ్ అమలు చేయాలని సెర్ప్ ఉద్యోగుల సంఘాలు రెండు దశాబ్దాల నుంచి పోరాటం చేస్తున్నాయి. ఇరవై ఏళ్ల క్రితం వెలుగు పేరుతో ఏర్పాటైన ఈ సంఘం ఆ తర్వాత ఐకేపీగా రూపాంతరం చెంది ప్రస్తుతం సెర్ప్‌గా కొనసాగుతోంది. ఈమేరకు 23 ఏళ్లకు వారి పోరాటాన్ని, సేవలను గుర్తించిన ప్రభుత్వం పే స్కేల్ ఇచ్చేందుకు అంగీకరించింది. గతంలోనే ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా ఆచరణలో సాధ్యం కాలేదు. ఈ ఏడాది బడ్జెట్‌లో హామీ అమలుకు నిధులు కూడా కేటాయించారు. సెర్ప్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 342 మంది విధులు నిర్వర్తిస్తుండగా, ఖమ్మం జిల్లాలో 179 మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 163 మంది ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు. వీరిలో ఏపీడీ, డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, మినిస్టీరియల్ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు.

ఎంతో అభివృద్ధి చేశా.. ఇంకా చేస్తా!

- మళ్లీ సేవ చేసే అవకాశం రావాలని కోరుకుంటున్నా...
- మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నేలకొండపల్లి: మరో నాలుగేళ్లలో పాలేరు నియోజకవర్గం మాదిరి ఎక్కడా లేనంతగా అభివృద్ధి చెందుతుందని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని వసుంధర కాలేజీలో వార్షికోత్సవం గురువారం జరగగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ, ఇంటర్ కాలేజీలకు పక్కా భవనాలు మంజూరు చేయడంతో పాటు రామదాసు మందిరాన్ని రూ.4 కోట్లతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. పాలేరు పాత కాలువను రూ.70 కోట్లతో పూర్తి చేయడమే కాక ప్రతీ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించిన తాను సీతారామ ప్రాజెక్టుకు కూడా పూర్తిచేసి గోదావరి జలాలను పాలేరుకు తీసుకొస్తానని చెప్పారు. రాష్ట్రంలోనే ఎక్కువ శాతం నీటి పారుదల సౌకర్యం కలిగిన నియోజకవర్గం పాలేరు కావడంతో రానున్న నాలుగేళ్లలో గణనీయమైన అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఆనాడు ప్రజలకు ఇచ్చిన మాట కోసం పెద్ద పాలేరుగా పనిచేయగా, ప్రజలకు మళ్లీ సేవ చేసే అవకాశం ఇవ్వాలని భగవంతుడిని కోరకుంటున్నానని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ నల్లమల్ల వెంకటేశ్వరరావు, జిల్లా ఇంటర్ విద్యాధికారి కె.రవిబాబు, ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ కె.రాజేష్, కళాశాల కరస్పాండెంట్ ఈగ అనిల్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు సాధు రమేష్‌రెడ్డి, శాఖమూరి రమేష్, వెన్నపూసల సీతారాములు, కాసాని నాగేశ్వరరావు, గుడిపాటి ముక్కంటి, కొమ్మూరి నరేష్, కడియాల శ్రీనివాసరావు, మైసా శంకర్, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

24న దేవాదాయ శాఖ ఉద్యోగ, అర్చక సంఘం ఎన్నికలు

ఖమ్మంగాంధీచౌక్: దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉద్యోగులు, అర్చకుల జిల్లా సంఘాల ఎన్నిక ఈనెల 24న నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ఉద్యోగులు, అర్చకుల సంఘాల అధ్యక్షులు తోటకూర వెంకటేశ్వర్లు, దాములూరి వీరభద్రరావు తెలిపారు. ఖమ్మం శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు. కాగా, ఇప్పటివరకు ఉమ్మడి జిల్లా స్థాయిలో కొనసాగుతున్న కమిటీలను ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు వేర్వేరుగా ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో పోటీకి ఆసక్తి ఉన్న వారు ఈనెల 20వ తేదీ నాటికి నామినేషన్లను దాఖలు చేయాలని సూచించారు. ఖమ్మం జిల్లా కమిటీలకు ఎన్నికల అధికారిగా స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు, భద్రాద్రి జిల్లా ఎన్నికల అధికారిగా కాల్వొడ్డు ఆంజనేయస్వామి ఆలయ ఈఓ వీ.వీ.నర్సింహారావు వ్యవహరిస్తారని తెలిపారు.

భవిష్యత్ అవసరాల మేరకు కొత్త గనులు

మణుగూరు ఏరియాలో పర్యటించిన సింగరేణి డైరెక్టర్లు



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న సింగరేణి డైరెక్టర్లు

మణుగూరుటౌన్: భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని మణుగూరు ఏరియాలో కొత్త గనుల ఏర్పాటుపై నిర్దిష్టమైన ప్రణాళికలు రూపొందించాలని సింగరేణి డైరెక్టర్ ఎస్.బలరామ్ సూచించారు. డైరెక్టర్లు ఎస్‌వీకే.శ్రీనివాస్, జి.వెంకటేశ్వర రెడ్డి, జీఎం(సీసీఅండ్‌పీ) కార్పొరేట్ సీహెచ్.నర్సింహారావుతో కలిసి ఆయన మణుగూరు ఏరియాలో గురువారం పర్యటించారు. తొలుత కొండాపురం భూగర్భ గని, ఇతర ఓపెన్‌కాస్టు గనులను సందర్శించి ఏరియా ఉత్పత్తి ఉత్పాదకతపై జీఎం దుర్గం రాంచందర్‌తో చర్చించారు. ఆతర్వాత జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షలో డైరెక్టర్లు మాట్లాడుతూ.. మణుగూరు ఏరియాకు బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతలో మంచి పేరు ఉన్నందున అదే ఒరవడి కొనసాగించాలని సూచించారు. ఈఏడాది లక్ష్యం మేరకు 116లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని అధిగమించి, రానున్న ఏడాదికి ఇప్పుడే లక్ష్యాలను నిర్దేశించుకోవాలని తెలిపారు. కార్మికుల సంక్షేమంపై యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. దేశవ్యాప్తంగా విద్యుత్ సంస్థలకు బొగ్గు కొరత ఏర్పడిన నేపథ్యాన ఆయా సంస్థలకు బొగ్గు సరఫరా చేస్తూనే ఇతర పరిశ్రమలకు ఏకకాలంలో బొగ్గు అందించాల్సిన అవసరముందని చెప్పారు. ఇక పీకేఓసీ–2 నుంచి రోజుకు 42వేల టన్నుల నుంచి 45వేల టన్నుల మేర రవాణా చేయాలని డైరెక్టర్లు ఆదేశించారు. ఈకార్యక్రమంలో సింగరేణి అధికారులు డి.లలిత్‌కుమార్, జి.నాగేశ్వరరావు, డి.వెంకటేశ్వర్లు, నర్సిరెడ్డి, లక్ష్మీపతిగౌడ్, శ్రీనివాసాచారి, ఎస్.రమేష్, వెంకట్రావు, సురేష్ పాల్గొన్నారు.

ఇల్లెందులో ‘భూగర్భ’ డైరెక్టర్ పర్యటన



భూగర్భ జలాలను పరీక్షిస్తున్న అధికారులు

ఇల్లెందు: సింగరేణి పరిధిలోని ఇల్లెందు ఏరియా జేకే ఓసీ విస్తరణలో భాగంగా భూగర్భ జలాల పరిశీలన నిమిత్తం భూగర్భ జలాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ పండిత్ మధునూరె, డిప్యూటీ డైరెక్టర్ జ్యోతికుమార్, అసిస్టెంట్ డైరెక్టర్లు రమేష్, బాలూనాయక్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా జేకే ఓసీ పరిధిలో భూగర్భ జలమట్టం, ఇతర వివరాలను ఆరా తీశారు. ఏరియా జీఎం షాలేము రాజు మాట్లాడుతూ.. భూగర్భ జలాల క్లియర్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు గాను అధికారులు పర్యటించారని తెలిపారు. భూగర్భ జలాల అభివృద్ధి కోసం నిర్మించిన చెక్‌డ్యాంలు, హార్వెస్టర్ పిట్లు, బోర్లను తనిఖీ చేశారని పేర్కొన్నారు. అధికారులు మల్లారపు మల్లయ్య, రాజ్‌కుమార్, నామ కుమార్, ధనుంజరెడ్డి, పులి పూర్ణచందర్‌రావు, చిన్నయ్య, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు రవాణాకు అంతరాయం ఏర్పడొద్దు



ఓసీలో వ్యూ పాయింట్ వద్ద చర్చిస్తున్న అధికారులు

సత్తుపల్లిరూరల్: సింగరేణి పరిధి సత్తుపల్లి మండలంలోని జేవీఆర్ ఓసీ, ఈపీసీ, సీహెచ్‌పీ, సైలో బంకర్, కోల్ రిసీవింగ్ సెంటర్లను ఆల్విన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సూర్యనారాయణ గురువారం పరిశీలించారు. జీఎంలు స్వామినాయుడు, జక్కం రమేష్, ఎస్ఓఎం సుందరరాజుతో కలిసి పర్యటించిన ఆయన బొగ్గు రవాణా విషయంతో అంతరాయం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీహెచ్‌పీ యాజమాన్యాన్ని ఆదేశించారు. రానున్న రెండు నెలలు లక్ష్యసాధనలో కీలకమైనందున అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఏ రోజు ఉత్పత్తి అయిన బొగ్గును అదే రోజు రవాణా చేయాలని, రోజూ కనీసం 10 రేకుల బొగ్గు రవాణాకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం సూర్యనారాయణ, పి.నర్సింహారావు, కేశవరావు, మధుసూదన్ పాల్గొన్నారు.